

ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా పోరాటం

- సిఐటియు రాష్ట్ర అధ్యక్షుడు ఎవి.నాగేశ్వరరావు
- సిఐటియు జిల్లా మహాసభ విజయవంతం



మహాసభలో మాట్లాడుతున్న సిఐటియు రాష్ట్ర అధ్యక్షులు ఎవి.నాగేశ్వరరావు

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

కేంద్ర ప్రభుత్వం ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటీకరించడాన్ని వ్యతిరేకిస్తూ రానున్న కాలంలో కార్మిక వర్గాన్ని పోరాటాలకు సిద్ధం చేయాలని సిఐటియు రాష్ట్ర అధ్యక్షులు ఎవి. నాగేశ్వరరావు పిలుపునిచ్చారు. ఆదివారం కార్మిక కర్షక భవన్‌లో సిఐటియు 13వ జిల్లా మహాసభలు రెండవ రోజు సందర్భంగా ఆయన మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రైవేటీకరణ దిశగా వేగవంతం చేశాయన్నారు. కార్మిక చట్టాల్లో మార్పులలో భాగంగా ఎనిమిది గంటల పని విధానాన్ని 12 గంటలుగా మార్పు చేసిన ప్రభుత్వాలకు వ్యతిరేకంగా పోరాటాలకు కార్మిక వర్గాన్ని సిద్ధం చేయాలన్నారు. కార్మిక వర్గంపై జరుగుతున్న దాడులను తిప్పి కొట్టాలన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల అవలంబిస్తున్న ఆశ, అంగన్వాడి, భవన నిర్మాణం, ఆటో, మధ్యాహ్న భోజనం , ఇతర రంగాలపై చర్చించారు. ఇదేకాక రానున్న రోజుల్లో వివిధ తీర్మానాలపై పోరాటాలు నిర్వహించాలని మహాసభకు పిలుపునిచ్చారు.

కార్మికోద్యమ బలోపేతానికి ఉధృత పోరాటం: మహాసభ తీర్మానం

కార్మిక ఉద్యమాన్ని బలోపేతం చేయడానికి భవిష్యత్తులో మిలిటెంట్ పోరాటాలు నిర్వహించాలని మహాసభ తీర్మానించింది. రెండు రోజుల పాటు నిర్వహించిన మహాసభలో 200 మంది ప్రతినిధులు పాల్గొన్నారు. కార్మికులను బానిసలుగా మార్చే నాలుగు లేబర్ కోడ్లకు, వ్యతిరేకంగా, మిలిటెంట్ పోరాటాలు కొనసాగించాలని ఒకగ్రీవంగా ఆమోదించింది. రాష్ట్ర ప్రభుత్వం రిటైర్ అయిన ప్రభుత్వ ఉద్యోగుల స్థానంలో కాంట్రాక్ట్ ఔట్‌సోర్సింగ్ పేరుతో వెట్టిచాకిరి చేయించుకుంటున్న వారినందరికి రెంగ్యులర్ చేయాలని, నగరాలలో పట్టణాల్లో షాపింగ్ మాల్స్ ప్రైవేటు నర్సింగ్ హోమ్స్, ప్రైవేటు స్కూళ్లలో కార్మికులకు కనీస వేతనాలు, పని భద్రత, అమలు చేయడం లేదని, వారికి పిఎఫ్, ఐఎస్ఐ చట్టాల అమలు చేయాలని తీర్మానించారు. రాష్ట్ర ప్రభుత్వంలో స్కీమ్ వర్కర్లుగా పనిచేస్తున్న అంగన్వాడీ, ఆశ, మధ్యన భోజనం కార్మికులు విఆర్ఎలకు కనీస వేతనం రూ.26,000 ఇవ్వాలని, స్కీం వర్కర్లకు సంక్షేమ పథకాల అమలు చేయాలని, ప్రైవేట్ రవాణారంగంలో పనిచేస్తున్న డ్రైవర్లకు ఇన్సూరెన్స్ సౌకర్యాలు కల్పించాలని ప్రభుత్వ పథకాలు ద్వారా నష్టపోతున్న కార్మికులకు రూ.30,000 ఆర్థిక సాయం అందించాలని మహాసభ తీర్మానించింది.

సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు మాజీ ఎమ్మెల్యే ఎంఎ. గఫూర్, సిఐటియు జిల్లా అధ్యక్షుడు కార్యదర్శులు పిఎస్.రాధాకృష్ణ, ఎండి.అంజిబాబు, జిల్లా నాయకులు. పి.నిర్మల ,రామాంజనేయులు, గోపాల్, నారాయణ స్వామి, సాయిబాబా, విజయ్, ప్రభాకర్, నగేష్, నరసింహులు, అబ్దుల్ దేశాయ్, రాముడు, వెంకటమ్మ, రేణుకమ్మ, సుధాకరప్ప, వివిధ రంగాల నాయకులు పాల్గొన్నారు. అంతర్జాతీయ గీతంతో మహాసభ ముగిసింది.

గిట్టుబాటు ధర కల్పించేలా చర్యలు

- కోల్డు స్టోరేజీ పూర్తికి రూ.7కోట్లతో ప్రతిపాదనలు
- ప్రజాశక్తితో మార్కెట్ యార్డ్ కార్యదర్శి ఆర్.జయలక్ష్మి

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

మార్కెట్‌కు పంటలు తీసుకొచ్చే రైతులకు గిట్టుబాటు ధర కల్పించేలా చర్యలు తీసుకుంటామని మార్కెట్ యార్డ్ స్పెషల్ గ్రేడ్ సెక్రెటరీ ఆర్.జయలక్ష్మి పేర్కొన్నారు. అసంపూర్తిగా ఆగిపోయిన కోల్డ్ స్టోరేజీ పూర్తికి రూ.7 కోట్లతో ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపామని తెలిపారు. ప్రజాశక్తితో ఆమె ముఖాముఖిగా మాట్లాడారు..



మార్కెట్ యార్డ్ గురించి చెప్పండి..?

సెక్రెటరీ: మార్కెట్ యార్డ్ విస్తీర్ణం 25.17 ఎకరాలు ఉంది. మార్కెట్ యార్డులో మొత్తం సిబ్బంది 41 మంది, అందు 21 మంది పని చేస్తున్నారు. 20 ఖాళీలు ఉన్నాయి. ఔట్‌సోర్సింగ్ కింద 23 మంది ఉద్యోగులు పనిచేస్తున్నారు. సెక్యూరిటీ గార్డులు 33 మంది మంజూరు అయితే 28 మంది పనిచేస్తున్నారు. కమిషన్ ఏజెంట్లు 242 మంది ఉన్నారు.

ఏఏ పంటలు మార్కెట్‌కు తెస్తూ ఉంటారు?

సెక్రటరీ : కర్నూలు జిల్లానే కాకుండా నంద్యాల, తెలంగాణ ప్రాంతం నుండి కూడా రైతులు కర్నూలు మార్కెట్ యార్డ్‌కు తాము పండించిన పంటలు తెచ్చి అమ్ముకుంటుంటారు. అందులో ప్రధానంగా వేరుశనగ, ప్రొద్దుతిరుడు, ఆముదం, ఎండుమిర్చి, కందులు, శనగలు, మొక్కజొన్న, ఉల్లి, మినుములు, కొర్రలు, సోయాబీన్, వాము లాంటి పంటలు తెస్తూ ఉంటారు. ఖరీఫ్, రబిలో మాత్రం ఉల్లి పంటను రైతులు తెస్తారు. మిగతా పంటలన్నీ ఖరీఫ్‌లోనే వస్తూ ఉంటాయి.

మార్కెట్ యార్డ్ పరిధిలో మొత్తం ఎన్ని షాపులు, గోడౌన్లు ఉన్నాయి?

సెక్రటరీ : మార్కెట్ యార్డ్ పరిధిలో 230 షాపులు ఉన్నాయి. అందు కమిషన్ ఏజెంట్లకు సంబంధించి 190 షాపులు, 40 వెజిటబుల్ షాపులు ఉన్నాయి. మొత్తం 7 గోడౌన్లు ఉన్నాయి. అన్ని కండిషన్‌లోనే ఉన్నాయి. 5వేల మెట్రిక్ టన్నుల గోడౌన్ ఒకటి, 600 మెట్రిక్ టన్నుల గోడౌన్లు నాలుగు, 270 మెట్రిక్ టన్నుల గోడౌన్లు రెండు ఉన్నాయి.

కోల్డ్ స్టోరేజ్ గోడౌన్ ఎందుకు ఆగిపోయింది?

సెక్రటరీ : 4 వేల మెట్రిక్ టన్నుల సామర్థ్యం గల ఐదు అంతస్తుల కోల్డ్ స్టోరేజ్ 2017లో ఆర్‌డిఎఫ్ స్కీం కింద నాలుగు కోట్లతో ప్రారంభించారు. 2019లో ఆ స్కీము అయిపోవడంతో మధ్యలో ఆగిపోయింది. మళ్లీ అది పూర్తి చేయడానికి ప్రభుత్వానికి 7 కోట్ల రూపాయలతో ప్రపోజల్స్ పెట్టాం.

2025లో మార్క్‌ఫెడ్ ద్వారా ఎన్ని క్వింటాళ్ల ఉల్లిని కొన్నారు?

సెక్రటరీ : కర్నూలు జిల్లా నలుమూలల నుండి విపరీతంగా ఉల్లి పంట మార్కెట్కు రావడంతో మార్క్ఫెడ్ ద్వారా ప్రభుత్వం 69 వేల క్వింటాళ్లు 8 కోట్ల 22 లక్షల విలువగల ఉల్లి కొనుగోలు చేయడం జరిగింది. మార్కెట్కు వచ్చిన ఉల్లి వ్యాపారస్తులు కొనగా రూ.1200 రూపాయలకు తేడా ఉన్న మొత్తాన్ని రూ.1.9 కోట్లను రైతుల ఖాతాల్లో జమ చేయడం జరిగింది. ఇంకా ఎనిమిది కోట్ల రూపాయలు ప్రభుత్వం నుండి విడుదల అయ్యాయి. వాటిని కూడా రైతుల ఖాతాల్లో జమ చేస్తాం.

2024- 25 సంవత్సరానికి గాను మార్కెట్ యార్డుకు ఆదాయం ఎంత వచ్చింది?

సెక్రటరీ : 2024 –25 సంవత్సరానికి ఏడు కోట్ల ఐదులక్షల రూపాయలు టార్గెట్ కాగా 8 కోట్ల 41 లక్షల రూపాయలు ఆదాయము వచ్చింది.

వర్షం పడినప్పుడల్లా మార్కెట్ యార్డ్‌లో నీరు నిలిచి ధాన్యం తడిసిపోతుంది. ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?

సెక్రటరీ : బయటి రోడ్డు కాలువల కన్నా మార్కెట్ యార్డ్ తగ్గుగా ఉండడం చేత మురికి కాలువలోని నీరు వర్షం పడినప్పుడు నీరు నిలిచి మార్కెట్ యార్డ్‌లోకి వస్తున్నాయి. కాంట్రాక్టరుకు గతంలో చేసిన పనులకు రెండు కోట్ల రూపాయల బిల్లులు పెండింగ్లో ఉన్నాయి. కావున కాంట్రాక్టర్లు పనిచేయడానికి ముందుకు రావడం లేదు. ప్రస్తుతము నీరు నిలవకుండా పాత కాలువలను శుభ్రం చేయిస్తున్నాం. వర్షపు నీరు మార్కెట్ యార్డ్‌లో ఉండకుండా బయటికి వెళ్ళే విధంగా చర్యలు తీసుకుంటున్నాం.

షాపుల అద్దెలు సక్రమంగా చెల్లిస్తున్నారా?

సెక్రటరీ : మార్కెట్ యార్డ్ కు సంబంధించిన షాపుల అద్దెలు సక్రమంగా చెల్లిస్తున్నారు. కమర్షియల్ షాపుల్లో మాత్రమే రెండు నెలలు పెండింగ్ పెట్టిన వారికి నోటీసులు ఇవ్వడంతో అద్దెలు చెల్లిస్తున్నారు.

మార్కెట్ యార్డ్ అభివద్ధి కోసం ఏమైనా తీర్మానాలు చేశారా?

సెక్రటరీ : నూతనంగా ఏర్పడిన పాలకమండలి వెజిటేబుల్, కమర్షియల్ 40 షాపులు కట్టేందుకు నిర్ణయించారు. అలాగే 15 మంది సెక్యూరిటీ గార్డులను అదనంగా తీసుకునే విధంగా ప్రపోజల్సు పెట్టడం జరిగింది.

ముఖాముఖి

చినుకు పడితే చిత్తడి

- పత్తికొండ టమోట మార్కెట్ దుస్థితి
- స్పందించని పాలకులు - గత ప్రభుత్వంపై ఆరోపణలు



బురదమయంగా మారిన పత్తికొండ మార్కెట్

ప్రజాశక్తి-పత్తికొండ

అన్నీ ఉన్నా అల్లుడి నోట్లో శని అన్న చందంగా పత్తికొండ వ్యవసాయ మార్కెట్ పరిస్థితి తయారైంది. మార్కెట్ అభివృద్ధి కోసం రూ.కోటి 50 లక్షలు నిధులు ఉన్నా పాలకులు, అధికారులు నిర్లక్ష్యంతో రైతులు అనేక ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వ అధికారులు పత్తికొండ మార్కెట్ యార్డ్‌ను తొమ్మిది ఎకరాల విస్తీర్ణంలో ఏర్పాటు చేశారు. వర్షాకాలంలో చినుకు పడితే చిత్తడితో దుర్వాసన వస్తుంది. దీంతో రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పత్తికొండ వ్యవసాయమార్కెట్‌కు పత్తికొండ ,దేవనకొండ, తుగ్గలి, మద్దికేర ఆస్పరి ,ఆలూరు మండలాల రైతులు పండించిన టమోటా , కూరగాయలు తెస్తారు. ఆగస్టు నుండి డిసెంబర్ వరకు క్రయవిక్రయాలు జరుగుతాయి. 2017–18 సంవత్సరంలోని టిడిపి ప్రభుత్వం మార్కెట్ అభివృద్ధి కోసం రూ.కోటి50 లక్షలు మంజూరు చేసింది. గత ఐదు సంవత్సరాలు వైసిపి ప్రభుత్వం మార్కెట్ అభివృద్ధి నిధులను సిసిరోడ్లు, డ్రైనేజీ, మరుగుదొడ్లు, షెడ్లు ఏర్పాటు చేయకుండా కాలయాపన చేసింది. పత్తికొండ వ్యవసాయ మార్కెట్ యార్డులో ప్రతి సోమవారం పశువుల సంత నిర్వహిస్తారు. గత మూడు సంవత్సరాల నుండి సెస్సు వసూలు రూపంలో సుమారు 70 లక్షల వస్తుంది. రైతులకు కనీస మౌలిక సదుపాయాలు కల్పించడంలో ప్రభుత్వాలు పూర్తిగా విఫలం చెందాయని రైతు సంఘాల నాయకులు విమర్శిస్తున్నారు. ఇప్పటికైనా జిల్లా యంత్రాంగం పత్తికొండ మార్కెట్ యార్డ్ పై ప్రత్యేక దృష్టి పెట్టాలని రైతులు కోరుతున్నారు.

బురదలోని అమ్ముకోవాలి...



వర్షంలో తడుస్తూ బురదలోని టమోటాలు, కూరగాయలు అమ్ముకోవాల్సి వస్తుంది. రైతులు కూర్చోవడానికి, విశ్రాంతి తీసుకోవడానికి వసతి లేదు. మార్కెట్లో అష్టకష్టాలు పడాల్సిన పరిస్థితి ఉంది.

- రైతు రంగన్న, హోసూరు గ్రామం, పత్తికొండ మండలం.

సొంత డబ్బుతోనే మట్టిని వేస్తున్నాం...



గత 30 సంవత్సరాలుగా టమోటా వ్యాపారం చేస్తున్నం. వర్షాకాలంలో టమోటా కొనుగోలు చేయాలంటే ఇబ్బందులు పడుతున్నాం. అధికారులు గుంతలు పూడ్చడం లేదు. వ్యాపారస్తులంతా కలసి సొంత డబ్బుతో మట్టిని వేసుకున్నాం.

- టమోటా లైసెన్స్ వ్యాపారి మల్లికార్జున, పత్తికొండ.

మార్కెట్ యార్డ్ అభివృద్ధిని విస్మరించారు



ఐదేళ్లలో వైసిపి ప్రభుత్వం మార్కెట్ యార్డ్ అభివృద్ధిని విస్మరించారు. మార్కెట్ యార్డ్ అభివృద్ధి కోసం రూ.1.75 లక్షలతో ప్రభుత్వానికి నివేదిక పంపించాం. రూ.1.50 లక్షలతో సిసి రోడ్లు, డ్రెయినేజీలు మరుగుదొడ్లు ఏర్పాటు చేస్తాం. రూ.25 లక్షలతో కాంపౌండ్ ఏర్పాటు చేస్తాం. అభివృద్ధికి రైతులందరూ సహకరించాలని కోరారు.

- నబి సాహెబ్, మార్కెట్ యార్డ్ చైర్మన్ .

మౌలిక సదుపాయాలు కల్పించకపోవడం దుర్మార్గం



పత్తికొండ వ్యవసాయ మార్కెట్‌కు రూ.లక్షల్లో ఆదాయం ఉన్నా రైతులకు మౌలిక సదుపాయాలు కల్పించకపోవడం చాలా దుర్మార్గం. పండించిన పంటలు వర్షంలో తడుస్తూ అమ్ముకోవాల్సిన పరిస్థితి ఉంది. మౌలిక సదుపాయాలు కల్పించకపోతే రాబోయే రోజుల్లో రైతులను కలుపుకొని పెద్ద ఎత్తున ఆందోళన చేపడతాం.

-సిద్దయ్య గౌడ్, రైతు సంఘం మండల కార్యదర్శి .

బస్సు ప్రమాద ఘటన మృతదేహాలు అప్పగింత





కర్నూలు జిల్లా చిన్నటేకూరు సమీపంలో వేమూరి కావేరి బస్సు ప్రమాద ఘటనలో మృతదేహాలను ఆదివారం వారి బంధువులకు అప్పగించారు. అంబులెన్సులు ఏర్పాటు చేసి వారి స్వగ్రామాలకు మృతదేహాలను తరలించారు. అనంతరం కలెక్టర్ మీడియా సమావేశం నిర్వహించి మాట్లాడారు. (వార్త మెయిన్ పేజీలో..)

ఆయుధాలపై విద్యార్థులకు అవగాహన

- 2 రోజులు జిల్లా పోలీసు కార్యాలయంలో ఓపెన్ హౌస్
- ఉదయం 10 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు

ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్

పోలీసు అమర వీరుల వారోత్సవాలలో భాగంగా కర్నూలు జిల్లా ఎస్పి విక్రాంత్ పాటిల్ ఆదేశాల మేరకు ప్రతీ ఏటా అమరవీరుల పోలీసులను స్మరించుకుంటూ నిర్వహించే ఓపెన్ హౌస్ కార్యక్రమాన్ని ఆదివారం జిల్లా పోలీసు కార్యాలయంలో అడిషనల్ ఎస్పిలు హుస్సేన్ పీరా, కృష్ణమోహన్ ప్రారంభించారు. అడిషనల్ ఎస్పిఅడ్మిన్ హుస్సేన్‌పీరా మాట్లాడుతూ పోలీసుల విధుల్లో వినియోగించే ఆయుధాలు, సాధనాల పట్ల విద్యార్థులు విద్యార్థి దశ నుండే అవగాహన కల్గి ఉండటం మంచిదన్నారు. పోలీసులు తమ దైనందిన విధుల్లో వినియోగించే వివిధ రకాల ఆయుధాలు, పరికరాల గురించి కళాశాల, పాఠశాల విద్యార్థులు తెలుసుకోవాలన్నారు. ఎఆర్ అడిషనల్ ఎస్పి కష్ణమోహన్ మాట్లాడుతూ... అమరవీరుల వారోత్సవాలలో భాగంగా ఈనెల 26,27 తేదీల్లో ఓపెన్ హౌస్ కార్యక్రమం నిర్వహిస్తున్నామని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఎలాంటి సందర్భంలో ఏ ఆయుధాన్ని వినియోగిస్తారు, వాటి పనితీరు గురించి తెలియజేస్తున్నామన్నారు.

ప్రదర్శనలో ఉంచిన ఆయుధాలు

22 రైఫిల్ , 410 మస్కెట్, 303 రైఫిల్, 303 జిఎఫ్ రైఫిల్,303 ఎల్ ఎమ్‌జి , 762 ఎంఎం బార్, 762 ఎంఎం ఎస్–ఎల్ఆర్ , 762 ఎల్ఎంజి, 5.56 ఎంఎం ఇన్సాస్ రైఫిల్, ఎకె.47, 9 ఎంఎం కార్బైన్, 9 ఎంఎం ఫిస్టోల్ , 9 ఎంఎం గ్లాక్ ఫిస్టోల్, 380 రివాల్వర్ , 12 బోర్ పంప్ యాక్షన్ గన్ , 51 ఎంఎం మోటారు, యుబిజిఎల్, 38ఎంఎం మల్టీ సెల్ లాంచర్, 303 రైట్ గన్, 1.5 పెడరల్ గ్యాస్‌గన్, విఎల్ పిస్టోల్, ట్రాంచెన్ పిస్టోల్, టియర్ స్మోక్ సెల్స్, టియర్ స్మోక్ గ్రానైడ్, ఫైబర్ లాఠీ, గ్రెనైడ్, ప్లాస్టిక్ పెల్లెట్, స్టోన్ గార్డు, హెల్మెట్ , బుల్లెట్ ప్రూఫ్ జాకెట్ , డే విజన్ బైనాక్యూలర్ , బాంబు డిటెక్టర్ , స్పీడ్ గన్ మెషిన్, ట్రాఫిక్ సిగ్నల్ సైన్ బోర్డు, స్పీడ్ లెజర్ గన్, నాయిస్ పొల్యూషన్ మెషిన్, ఎసిహెల్మెట్, డ్రంకెన్ డ్రైవ్ బ్రీత్ ఎనలైజర్ మెషిన్, బ్యాటెన్‌లైట్, కార్‌వీల్‌లాక్, రేడియంజాకెట్, బాడీవోన్ కెమెరాలు, ఫింగర్ ప్రింట్ ఐడెంటిఫికేషన్, డ్రోన్ కెమెరాలు, వజ్రవాహనం, పాల్కన్, బాంబ్‌సూట్, డాగ్ స్క్వాడ్ బృందాలను తదితర ఆయుధాలను ప్రదర్శనలో ఉంచారు. ఆర్ఐలు పోతలరాజు, జావేద్ , నారాయణ, ఆర్ఎస్ఐలు, పోలీసు సిబ్బంది , నగరంలోని పలు విద్యాసంస్థలకు సంబంధించిన విద్యార్థులు పాల్గొన్నారు.

ఆయుధాల గురించి వివరిస్తున్న దృశ్యం



ఈ పంట నమోదు 29 లోపు పూర్తి : కలెక్టర్

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

భూకమతాల వర్గీకరణ మార్కింగ్ ప్రక్రియనును ఈ నెల 29వ తేదీ లోపు పూర్తిచేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.సిరి వ్యవసాయశాఖ అధికారులను ఆదేశించారు. ఈ పంట నమోదు కూడా పూర్తి కావాలని ఆదేశించారు. ఆదివారం మండల, డివిజన్ వ్యవసాయ శాఖ అధికారులతో భూకమతాల వర్గీకరణ, ఈ పంట నమోదు, పత్తి, ఉల్లి పంటల హార్వెస్టింగ్ పై కలెక్టర్ టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 9 లక్షల 94 వేల 879 ఖాతాలకు సంబంధించి మార్కింగ్ చేయాల్సి ఉందని, ఇందులో ఇంకా రెండు లక్షలు పెండింగ్ ఉందన్నారు. ఈ ప్రక్రియను ఈ నెల 29లోపు పూర్తిచేయాలని మండల వ్యవసాయ శాఖ అధికారులను ఆదేశించారు. ఆదోని, హాలహర్వి, ఓర్వకల్లు, ఆలూరు, చిప్పగిరి కృష్ణగిరి మండలాల్లో ఎక్కువగా పెండింగ్ ఉందని, త్వరితగతిన పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్‌లను అందర్నీ ఒక చోటకు చేర్చి ఆన్‌లైన్‌లో ఈ ప్రక్రియ పూర్తి చేసేలా చూడాలని మండల వ్యవసాయ శాఖ అధికారులను ఆదేశించారు. జిల్లాలోని అన్ని మండలాల వ్యవసాయ శాఖ అధికారులతో మాట్లాడి భూకమతాల వర్గీకరణ మార్కింగ్, పత్తిపంట హార్వెస్టింగ్ వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ పంట నమోదును కూడా 29వ తేదీ లోపు పూర్తిచేయాలని కలెక్టర్ ఆదేశించారు. ఎక్కడైనా పంట నష్టం జరిగి ఉంటే ఆ వివరాలను కూడా 34 కాలం ప్రొఫార్మాలో వివరాలు తీసుకోవాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. సోమవారం నుండి 29 వరకు భారీ వర్షాల నేపథ్యంలో పత్తి, ఉల్లి పంటల కోత జరుగకుండా రైతులకు అవగాహన కల్పించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. పత్తి పంటకు మంచి రేటు వచ్చే విధంగా హార్వెస్టింగ్ పై రైతులకు సలహాలు అందచేయాలని సూచించారు. తేమ శాతం లేకుండా పత్తి పంటను డ్రైచేసే విధంగా రైతులకు అవగాహన కల్పించాలని కలెక్టర్ సూచించారు. పత్తి పంట ఎంత సాగు అయింది, ఎన్ని కోతలు కోశారు, ఎంత ధర పలుకుతోందన్న వివరాలను పత్తిపంట పండించే మండలాల వ్యవసాయ శాఖ అధికారులను అడిగి తెలుసుకున్నారు.

జానీబాషకు అరుదైన గౌరవం

- ఎపిజె అబ్దుల్ కలాం నేషనల్ ప్రతిభా అవార్డు-2025

ప్రజాశక్తి -కర్నూలు కలెక్టరేట్

విద్యా రంగంలో విశేషమైన సేవలకు గుర్తింపుగా, శ్రీ సాయి క్రిష్ణ డిగ్రీ కాలేజీ ప్రిన్సిపల్ షేక్ మహమ్మద్ జానీబాష ప్రతిష్టాత్మక డాక్టర్ ఎపిజె అబ్దుల్ కలాం నేషనల్ ప్రతిభా అవార్డు–2025 ను అందుకున్నారు. ఈ అవార్డును సదరన్ ప్రైవేట్ లెక్చరర్స్ టీచర్స్ ఆర్గనైజేషన్(ఎస్‌పిఎల్‌టిఒ) తరపున, ఈనెల 26న గుంటూరులో జరిగిన కార్యక్రమంలో సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు డాక్టర్ పి. నాగయ్య, మాజీ ఎమ్మెల్సీ కెఎస్.లక్ష్మణరావు, టిడిపి రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి వహీద్ హుస్సేన్ కలిసి ప్రదానం చేశారు. జానీబాష మాట్లాడుతూ డాక్టర్ అబ్దుల్ కలాంస్ఫూర్తి నాకు ఎప్పుడూ ప్రేరణ అన్నారు. విద్య ద్వారా సమాజాన్ని ముందుకు నడిపించగలనన్న నమ్మకం ఈ అవార్డుతో మరింత బలపడిందన్నారు. ఈ గౌరవం తన తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు, కాలేజీ యాజమాన్యం, సహచర అధ్యాపకులు, విద్యార్థులందరికీ చెందిందని అన్నారు. ప్రిన్సిపల్ జానీబాషకు కళాశాల అధ్యాపక, అధ్యపకేతర సిబ్బంది, విద్యార్థులు శుభాకాంక్షలు తెలిపారు.



అవార్డును అందుకుంటున్న జానీబాషా

'అశోక' సిఇఒకు ద్రోణాచార్య అవార్డు

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్

కర్నూలు జిల్లా అశోక మహిళా ఇంజినీరింగ్ కళాశాల సిఇఒ డాక్టర్ హరిష్ కృష్ణ ఇటీవల హైదరాబాద్‌లోని టీ–హబ్‌లో జరిగిన ప్రతిష్టాత్మక కోహర్ట్ లీడర్‌షిప్ కాన్‌క్లేవ్‌లో ప్రసంగిస్తూ విద్యా రంగంలో కొత్త దిశగా అడుగులు వేస్తున్నారని మరోసారి చాటుకున్నారు. ఈ కాన్‌క్లేవ్‌లో దేశ వ్యాప్తంగా ఉన్న పరిశ్రమ ప్రముఖులు, ఆవిష్కరణల నిపుణులు, విద్యా రంగానికి చెందిన నాయకులు పాల్గొన్నారు. డాక్టర్ హరిస్‌కృష్ణ ఆర్టిఫిషియల్ ఇన్ ఎడుకేషన్ (విద్యలో కృత్రిమ మేధస్సు) అనే కీలక అంశంపై ప్రసంగిస్తూ, ఆధునిక విద్యలో టెక్నాలజీ ప్రాముఖ్యతను వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, 'భవిష్యత్తు విద్యార్థులు ప్రపంచ స్థాయి సాంకేతిక పోటీలకు సిద్ధంగా ఉండాలంటే, విద్యలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌ను సమర్థవంతంగా అనుసంధానం చేయడం అత్యవసరం అన్నారు. ఈ కార్యక్రమంలో ఆయనతోపాటు టిసిఎస్ చీఫ్ ఇన్నోవేషన్ ఆఫీసర్ బాల ప్రసాద్, ఐకార్ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ కల్పనా శాస్త్రి వంటి దేశంలోని ప్రఖ్యాత నిపుణులు వేదికను పంచుకున్నారు. వీరందరూ విద్యా రంగం ఎదుర్కొంటున్న సవాళ్లు, ఆవిష్కరణలకు సంబంధించిన అనుభవాలను పంచుకున్నారు. విద్యా రంగంలో నూతన ఆలోచనలను అమలు చేస్తూ, విద్యార్థుల్లో సృజనాత్మకతను పెంపొందించడంలో విశిష్ట పాత్ర పోషించినందుకు గుర్తింపుగా డాక్టర్ హరిస్ కృష్ణకు 'ద్రోణాచార్య అవార్డు' ప్రదానం చేశారు. ఈ అవార్డును టిసిఎస్ సిఇఒ బాల ప్రసాద్ స్వయంగా అందజేశారు. హరిస్‌కృష్ణ మాట్లాడుతూ ఈ గుర్తింపు నా వ్యక్తిగత గౌరవం మాత్రమే కాదని, అశోక మహిళా ఇంజినీరింగ్ కళాశాల మొత్తం బృందం కషికి లభించిన ఫలితం అన్నారు. మా లక్ష్యం ప్రతి విద్యార్థిని, టెక్నాలజీ ఆధారిత భవిష్యత్తు నాయకురాలిగా తీర్చిదిద్దడం అన్నారు. కళాశాల యాజమాన్యం, అధ్యాపకులు, విద్యార్థులు డాక్టర్ హరిస్‌కృష్ణకు హృదయపూర్వక అభినందనలు తెలిపారు. ఆయన నాయకత్వంలో కళాశాల విద్యా నాణ్యత, సాంకేతిక ఆవిష్కరణలు, విద్యార్థుల ప్రతిభ అంతర్జాతీయ స్థాయికి చేరుకుంటున్నాయని తెలిపారు. ఈ సత్కారం అశోక ఉమెన్స్ ఇంజినీరింగ్ కళాశాల ప్రతిష్ఠను మరింత పెంచిందన్నారు. విద్యా రంగంలో సాంకేతికతను సమర్థంగా వినియోగించి భవిష్యత్ భారతదేశానికి నూతన దిశ చూపిస్తున్న డాక్టర్ హరిస్ కృష్ణ వంటి నాయకులు దేశానికి స్ఫూర్తిదాయకులుగా నిలుస్తున్నారన్నారు.



ద్రోణాచార్య అవార్డును అందుకుంటున్న సిఇఒ హరీష్ కృష్ణ



గుంతలమయంగా మారిన రోడ్డు

ఈ రోడ్లపై వెళ్లేదేలా...?

- కంభదహాల్ వద్ద రోడ్డు దుస్థితిపై విమర్శకుల వేదన

ప్రజాశక్తి-సి బెళగల్ : సి బెళగల్ మండలంలో ఏ గ్రామానికి వెళ్లాలన్నా, మండల కేంద్రానికి రావాలన్నా రోడ్ల గుండా ప్రయాణం నరకయాతనగా మారింది. తరచూ కురుస్తున్న వర్షాలకు రోడ్లు తడారక రోడ్ల మధ్యలో బురదగుంటలు ఏర్పడ్డాయి. కంభదహాల్ గ్రామానికి సమీపంలో ఏళ్లుగా మూడు అడుగుల లోతులో గుంత ఏర్పడి కనీసం అక్కడ మట్టి వేసే నాధులు కానరావడం లేదు. కనీసం ప్రాథమిక చర్యలు చేపట్టిన ఆనవాళ్లు అంతకన్నా లేవు.. సిబెళగల్ నుండి ఎమ్మిగనూరు కు 23 కిలోమీటర్లు ఉంది.. రోడ్లు ఇంత దుర్భరంగా మారడంతో ప్రయాణికుల ఇబ్బందులు వర్ణనాతీతంగా మారాయి. వేరే దారి లేదు.. పక్కకు మట్టి రోడ్డు చేసుకొని వెళ్లాడని ఏమాత్రం వీలు పడదు. ఆటోలు, కార్లు బైకులు వంటివి ఆ గుంతల్లో ఇరుక్కొని పడుతున్న బాధలు అంతాఇంతా కాదు..

1 నుండి 7 వరకు కర్నూలు ఉత్సవాలు

ప్రజాశక్తి - కర్నూలు కల్చరల్ : నవంబర్ 1 నుండి 7 వరకు కర్నూలు టిజివి కళాక్షేత్రంలో సాంస్కృతిక సాహిత్య ఉత్సవాలు కర్నూలు ఉత్సవం పేరుతో నిర్వహిస్తున్నామని టిజివి కళాక్షేత్రం అధ్యక్షులు పత్తి ఓబులయ్య, ప్రధాన కార్యదర్శి యాగంటీశ్వరప్ప తెలిపారు. ఆదివారం ఈ మేరకు ప్రకటన విడుదల చేశారు. కర్నూలు ఉత్సవంలో ప్రతిరోజు ఉదయం 10 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు ఏకధాటిగా ప్రతిరోజు 12 గంటల నిరంతరాయ సాంస్కృతిక వినోద జానపద సాంప్రదాయ కార్యక్రమాలు ఉంటాయని వివరించారు. ఈ మేరకు నవంబర్ 1 నుంచి 7వ తేదీ వరకు కార్యక్రమాల రూపకల్పన చేశామన్నారు. ఉమ్మడి కర్నూలు జిల్లా వ్యాప్తంగా 40 పౌరాణిక ఏకాంకిక నాటక పోటీలకు దరఖాస్తులు వచ్చాయన్నారు. మొత్తం 120 మంది పౌరాణిక కళాకారులు వారం రోజులు పాటు ప్రదర్శనలు ఇస్తారని తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు ఏకాంకిక పోటీలు ఉంటాయన్నారు. ఆరు నుంచి రాత్రి 10 వరకు శాస్త్రీయ జానపద పల్లె పదాలు సంగీత విభావరి కార్యక్రమాలతోపాటు ఆయా రంగాల్లో విశిష్ట సేవలు అందించిన కళాకారులకు సత్కారాల ఉంటాయన్నారు. ఈ కార్యక్రమాన్ని ముచ్చటగా మూడోసారి రికార్డు చేయడానికి తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్ సంస్థ ఆమోదం తెలిపిందన్నారు.

నేడు ప్రజా ఫిర్యాదుల స్వీకరణ

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్ : కర్నూలు నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో 'ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక' కార్యక్రమం సోమవారం స్థానిక ఎస్‌బిఐ ఎంప్లాయీస్ కాలనీలోని నగరపాలక సమావేశ భవనంలో నిర్వహించనున్నట్లు కమిషనర్ పి.విశ్వనాథ్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు.

మెడికల్‌కాలేజీల ప్రయివేటీకరణను అడ్డుకుంటాం

-ఆలూరు ఎమ్మెల్యే బూసిన విరుపాక్షి

ప్రజాశక్తి-చిప్పగిరి

కూటమి ప్రభుత్వం మెడికల్ కళాశాలలను ప్రైవేటీకరణ చేయడానికి పూనుకుందని, ఎట్టి పరిస్థితులలోను ప్రైవేటు పరం కాకుండా వైసిపి అడ్డుకుని తీరుతుందని ఆలూరు ఎమ్మెల్యే బూసిన విరుపాక్షి అన్నారు. ఆదివారం రామదుర్గం, నగరడోణ నేమకల్ గ్రామలో మెడికల్ కాలేజీలు ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కోటి సంతకాల సేకరణ, రచ్చ బండ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మాట్లాడుతూ ప్రభుత్వ మెడికల్ కాలేజీలను ప్రైవేటీకరణ చేయకూడదనే ఉద్దేశంతోనే పార్టీ అధ్యక్షులు వైఎస్ జగన్మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు కార్యక్రమాలు చేస్తున్నామన్నారు. ప్రభుత్వ మెడికల్ కాలేజీలను ప్రైవేటికరణ చేస్తే పేదలకు వైద్యం అందకుండా పోతుందన్నారు. ప్రైవేటీకరణ విధానాన్ని రద్దు చేసేందుకే కోటిసంతకాల సేకరణ చేస్తున్నామన్నారు. ఒక్క సంతకం చేయండి ప్రజా ఉద్యమంలో మీరూ భాగస్వాములు కావాలని ప్రజలను కోరారు. అనంతరం ఎమ్మెల్యే సమక్షంలో



సమావేశంలో మాట్లాడుతున్న ఆలూరు ఎమ్మెల్యే విరుపాక్షి

గ్రామాల అనుబంధ విభాగాల కమిటీలను నియమించారు. కో ఆప్షన్ సభ్యులు సర్వర్‌ఖాన్, వైసిపి సీనియర్ నాయకులు విక్రాంత్ రెడ్డి, సర్పంచులు, ఎంపీటీసీలు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, జిల్లా కార్యవర్గ సభ్యులు, నియోజకవర్గ, మండల కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

1 నుంచి డివైఎఫ్ఐ ఆవిర్భావ దినోత్సవాలు

ప్రజాశక్తి-ఆదోనిరూరల్

డివైఎఫ్ఐ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలని డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు రాఘవేంద్ర కోరారు. డివైఎఫ్ఐ మండల సమావేశం కృకష్ణ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో రాఘవేంద్ర మాట్లాడుతూ నవంబర్ 1,2,3వ తేదీలలో జరిగే డివైఎఫ్ఐ 46వ దినోత్సవం ఘనంగా నిర్వహించాలన్నారు. దేశ చరిత్రలో డివైఎఫ్ఐ యువజన సంఘానిది ఘనమైన చరిత్ర అన్నారు. 45 యేళ్ల సుదీర్ఘ చరిత్రలో అనేక ఉద్యమాలు చేసిందన్నారు. యువజన సంఘాల ఉద్యమాలకు కేరాఫ్ అడ్రస్‌గా ముందు పీటన ఉందన్నారు. నిరంతరం నిరుద్యోగ సమస్య పరిష్కారం కోసం పోరాటం చేస్తూ అనేక విజయాలు సాధించిందన్నారు. డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో ఆదోనికి పూర్వ వైభవం తీసుకురావాలని అన్నారు. స్పిన్నింగ్ మిల్ పరిశ్రమకు అనుబంధంగా అనేక చిన్న



మాట్లాడుతున్న రాఘవేంద్ర

పరిశ్రమలు ఏర్పడి లక్షలాది మందికి ఉద్యోగాలు ఇచ్చిన ఆదోని నేడు వలసలకు నిలయమైందని ఆవేదన వ్యక్తం చేశారు. ఆదోనిని నిర్లక్ష్యం చేసిన పాలకులకు వ్యతిరేకంగా పోరాటాలు చేయాలని, దానికి డివైఎఫ్ఐ మద్దతిస్తుందని అన్నారు. డివైఎఫ్ఐ మండల కన్వీనర్ వీరేష్, మండల నాయకులు చిరంజీవి,ఉచిరప్ప, గర్జప్ప, రమేష్, మోహన్, మల్లికార్జున వివిధ గ్రామాల నుండి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అదుపు తప్పితే ప్రాణాలకే ముప్పు




లేబర్ కాలనీ హైస్కూలు వద్ద వాగుపై ప్రహరీ లేని రోడ్డు

-నెరవేరనిఎమ్మెల్యే హామీ

ప్రజాశక్తి-ఆదోని : రోడ్డు కల్వర్టుకు ప్రహరీ లేకపోవడంతో నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయి. సమస్య పరిష్కరించాలని స్థానికులు కొత్తగా ఎన్నికైన ఎమ్మెల్యే పార్థసారథి దృష్టికి తెచ్చారు అప్పట్లో ఎమ్మెల్యే హడాహుడిచేసి యుద్ధ ప్రాతిపదికన పనులు చేయిస్తామని నమ్మబలికి ఇంతవరకు కార్యరూపం దాల్చలేదు. ప్రమాదాలు జరగకుండా రక్షణ గోడలు నిర్మించి ప్రమాదాలు అరికట్టాలని ప్రహరీ నిర్మించాలని, అధికారులను కోరుతున్నా పట్టించుకోని పరిస్థితి. ఆదోని పట్టణంలోని ఆలూరు రోడ్డు పంజర పోలు నుండి లేబర్ కాలనీ మధ్యలో పెద్దవాగు ఉంది ఆ వాగు దాటి లేబర్ కాలనీకి వెళ్లాల్సి ఉంది. రోడ్డు ఎక్కువ పైభాగంలో ఉంది కల్వర్టుకు దగ్గర్లోనే హైస్కూల్ ఉంది. ఇక్కడ సుమారు 1200 మంది విద్యార్థులు చదువుతున్నారు. చదువుకోడానికి సైకిల్‌పై ఆటోలలో విద్యార్థులు స్కూళ్లకు వస్తారు. వాగుకు ఎప్పుడు మురుగునీరు ప్రవాహవం ఎక్కువగానే ఉంటుంది. కల్వర్టు కు కిందికి దిగే స్థానంలో ఇరువైపులా ఎలాంటి రక్షణ గోడలు లేవు. కల్వర్టుపై ఎదురుగా వచ్చే వాహనాలు ఏమాత్రం ఆ జాగ్రత్తగా డ్రైవర్లు వ్యవహరించినా వాగులో పడే అవకాశం ఉంది. ఇప్పటికే కొందరు అదుపుతప్పి బైకు నడిపేవారు కిందపడిన సందర్భాలు ఉన్నాయి.

లారీరాక పోకలతో ప్రమాదాలు జరిగే అవకాశం: రైల్వే వ్యాగన్ నుండి రసాయనక ఎరువులు సిమెంటు రేషన్ బియ్యం దిగుమతి జరుగుతుంది. అక్కడ నుండి లారీలలో బియ్యం రసాయనిక ఎరువులు సిమెంటు గోడంలకు తరలిస్తారు. లోడుతో వచ్చే లారీలు కల్వర్టు ఎత్తులో ఉండడం వల్ల లారీలు ఆలూరు రోడ్డుపైకి చేరుకోలేక కిందకి రివర్స్‌లో వచ్చి ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని స్థానికులు చెబుతున్నారు. ఒకే వాహనానికి సరిపోవు దారి ఉండటం వల్ల ఎదురుగా వచ్చే వాహనాలు అక్కడ అదుపుతప్పే అవకాశం లేకపోలేదని ఆందోళన చెందుతున్నారు. కల్వర్టు వేయిస్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చినా ఇంతవరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదని స్థానికులు చెబుతున్నారు. మున్సిపల్ అధికారులతో వాగుపై పర్యటించి ఇరువైపులా రక్షణ గోడలు వేయిస్తామని చెప్పి నెలలు గడుస్తున్నా కనీసం ఇనుప స్తంభాలు తోనైనా టెంపరరీ ఇరువైపులా ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

ప్రమాదాలు జరగకుండా చూడాలి :మోహన్ రావు



లారీలు లోడుతో వచ్చే సమయంలో ముందుకు వెళ్లలేక వెనక్కి వస్తున్నాయి. ఉదయం పూట స్కూళ్లకు విద్యార్థులు ఆ రోడ్డు గుండానే రాకపోకలు సాగిస్తున్నారు. ఆ సమయంలో కూడా వాహనాలు అటువైపునే వస్తున్నాయి. సైకిల్ పై వచ్చే విద్యార్థులు ఏమాత్రం ఆ జాగ్రత్త వహించినా కింద వాగులోకి పడే ప్రమాదం ఉంది. ఇప్పటికైనా అధికారులు రోడ్డుకు ఇరువైపులా వంతెనపై రక్షణ గోడలు నిర్మించాలని అధికారుల దృష్టికి తెచ్చాం. అప్పుడు ఇప్పుడు అంటున్నారే తప్ప ఇంతవరకు నిర్మించలేదు. ప్రమాదం జరగక ముందే స్పందించాలి

రక్షణ గోడలు నిర్మాణానికి ప్రతిపాదనలు - కృష్ణ మున్సిపల్ కమిషనర్



లేబర్ కాలనీకి వెళ్లే వాగుకు ఇరువైపులా రక్షణ గోడ నిర్మించాలని అందుకు కావలసిన నిధులకు ప్రతిపాదనలు సిద్ధం చేశాం. ఇక్కడ పర్యటించి పరిస్థితిని గమనించాను. రోడ్డుకోతకు గురికాకుండా చూస్తాం. మరింత వెడల్పు పెంచి రక్షణ గోడలు నిర్మిస్తాం. ప్రమాదాలు జరగకుండా జాగ్రత్తలు తీసుకుంటాం.

సమాజంలో బాధ్యతగా ఎదగాలి : డిఎస్‌పి భార్గవి

- ఘనంగా వైష్ణవి ఫ్రెషర్స్‌డే వేడుకలు

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

బాధ్యత గల పౌరులుగా సమాజంలో ఎదగాలని డిఎస్‌పి భార్గవి, ప్రముఖ స్త్రీవ్యాధి నిపుణురాలు డాక్టర్ శిల్ప నర్సింగ్ హోం నిర్వాహకురాలు డాక్టర్ శిల్ప, ప్రముఖ సీనియర్ న్యాయవాది హాక్ పేర్కొన్నారు. పట్టణంలోని మాచాని సోమప్ప మెమోరియల్‌లో వైష్ణవి ఎంబీఏ, వైష్ణవి డిగ్రీ, వైష్ణవి ఇంటర్ కళాశాలల ఫ్రెషర్స్‌డే వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. వైష్ణవి కళాశాలల చైర్మన్ జీడి లింగప్ప, కరస్పాండెంట్ సత్య సిరి, అకాడమీ చైర్మన్ జి. విష్ణుప్రభు నేతృత్వంలో వేడుకలను నిర్వహించారు. ముఖ్య అతిథులు మాట్లాడుతూ వైష్ణవి గ్రూప్స్ విద్యార్థులు సృజనాత్మకతో ముందుకెళ్లాలని, యాజమాన్యం ఇంటర్మీడియట్‌లో ఇంటర్ బోధనతోపాటు నీట్, జేఈఈలకు శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. అలాగే ఎంబీఏలో అడ్వాన్స్ కోర్సులను తీసుకొచ్చారన్నారు. అనంతరం విద్యార్థినీ, విద్యార్థులు ప్రదర్శించిన కూచిపూడి, భరతనాట్యం నృత్యాలు, దేశభక్తి, సినీ గీతాలు, కోలంటాలు అందరినీ ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో వైష్ణవి గ్రూప్ డైరెక్టర్లు గంగప్ప, కనక నిధి పట్టణ ఎస్ఐ మధుసూదన్ రెడ్డి, వైష్ణవి ప్రిన్సిపల్ కుమారస్వామి, మధుబాబు, మునెప్ప పాల్గొన్నారు.



విద్యార్థుల నృత్య ప్రదర్శన



ఫ్రెషర్స్‌డే వేడుకలలో మాట్లాడుతున్న డిఎస్‌పి భార్గవి

శివారు ప్రాంతాలను అభివృద్ధి చేయాలి

- టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి గుడిసె ఆది కృష్ణమ్మ

ప్రజాశక్తి - ఆదోని

అధికారులు శివారు ప్రాంతాలను అభివృద్ధి చేసేందుకు ప్రణాళికలు రూపొందించాలని టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి, టిడిపి మాజీ ఇన్‌ఛార్జీ గుడిసె ఆది కృష్ణమ్మ పేర్కొన్నారు. ఇందిరానగర్ సమీపంలో ఉన్న శ్రీ మహాయోగి లక్ష్మమ్మ నగర్ ప్రాంతంలో ఆమె ఆదివారం పర్యటించారు. కనీస మౌలిక వసతులు రోడ్లు, వీధిలైట్లు, డ్రెయినేజీలు లేక ప్రజలు అవస్థలు పడుతున్నా ఒక్కరు కన్నెత్తి చూడడం లేదని స్థానికులు ఆమె దృష్టికి తెచ్చారు. కాలనీపై భాగాన ఉన్న కొండ ప్రాంతం నుంచి వర్షం కురిసిన ప్రతిసారి నీళ్ల వీధి మధ్యలోకి వచ్చి నిలిచి పరిసరాలు అపరిశుభ్రంగా మారుతున్నయన్నారు. కాలనీ ఏర్పడి 25 ఏళ్ల అయినా మౌలిక సదుపాయాలు లేవన్నారు. ఎన్నికల సమయంలో మాత్రమే కాలనీలో రోడ్లు, డ్రెయినేజీ కాల్వలు, వీధిలైట్లు ఏర్పాటు చేస్తామని చెప్తున్నారు తప్పా మిగతా వేళల్లో కన్నెత్తి చూడడం లేదని వాపోయారు. వెంటనే రోడ్లు డ్రెయినేజీలు వేయించాలి ప్రజలు ఆమెను కోరారు.



శివారు కాలనీల్లో పర్యటిస్తున్న గుడిసె ఆది కృష్ణమ్మ

గుడిసె ఆది కృష్ణమ్మ మాట్లాడుతూ.. సమస్యలను ఎమ్మెల్యే పార్థసారథి, మున్సిపల్ అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఆమె వెంట మాజీ ఎంపీపీ మురళీ, మాజీ కౌన్సిలర్ మారుతి, భాస్కర్, లక్ష్మీనారాయణ, బాబురావు, దేవేంద్ర, స్థానికులు ఉన్నారు.

రోడ్లు వేయరు - ప్రయాణం సాగదు

ప్రజాశక్తి - కోసిగి



గ్రామీణ ప్రాంతాల రోడ్లు గుంతలు పడి పూర్తిగా ధ్వంసమయ్యాయి. చిన్నపాటి వర్షానికి నీళ్లు నిలవడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కూటమి ప్రభుత్వం రోడ్లు వేయరు.. ప్రయాణం సాగదు అంటూ వాహనదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గ్రామంలోని మెయిన్ రోడ్డు గుండా గ్రామ పంచాయతీ కార్యాలయం, సబ్ రిజిస్టర్ కార్యాలయం, పెట్రోల్ బంకు వద్ద రోడ్డు పూర్తిగా ధ్వంసమై గుంతలు పడ్డాయి. అదేవిధంగా రైల్వే గేటు నుండి ఉరుకుంద వెళ్లే దారిలో కంకర తేలి పెద్దపెద్ద గుంతలతో రోడ్డు ప్రమాదకరంగా మారిందని వాహనదారులు వాపోతున్నారు. చిన్నపాటి వర్షాని నీరు నిల్వ ఉండడంతో నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయని, కూటమి ప్రభుత్వం వచ్చి తూతూ మంత్రంగా ప్యాచ్ వర్కు చేసి కాంట్రాక్టర్లు జేబులు నింపుకున్నారే తప్పా పూర్తిస్థాయిలో రోడ్లు వేయలేదని వాహనదారులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా ఆర్అండ్‌బి అధికారులు స్పందించి గుంతలు పడిన రోడ్లకు మరమ్మతులు చేపట్టిన ప్రమాదాల నుండి కాపాడాలని వాహనదారులు, ప్రజలు కోరుతున్నారు.

వృద్ధులకు ఇంటివద్దకే రేషన్

ప్రజాశక్తి-ఆలూరు




వృద్ధుల ఇంటివద్ద బియ్యం పంపిణీ చేస్తున్న జ్యోతి

ప్రభుత్వం నెల ఆఖరిలో వృద్ధులకు, వికలాంగులకు ఇంటి వద్దకే రేషన్ పంపిణి చేయడం హర్షించదగ్గ విషయమని టిడిపి ఆలూరు ఇన్‌చార్జి వైకుంఠం జ్యోతి అన్నారు. ఆదివారం ఆలూరు పట్టణ కేంద్రంలోని రేషన్ షాప్ 29, 30 పరిధిలో ఉన్న వృద్ధులకు ఇంటివద్దకే రేషన్ పంపిణి చేశారు. వైకుంఠం జ్యోతి మాట్లాడుతూ ప్రభుత్వం వృద్ధులను, వికలాంగులను దృష్టిలో ఉంచుకొని ముందుగానే రేషన్ ఇంటివద్దకు తీసుకవెల్లి ఇవ్వాలని డీలర్లకు ఆదేశాలు ఇచ్చామన్నారు. ఇంటివద్దకు అందించని డీలర్లపై చర్యలు తీసుకుంటామని బాధితులు నిర్భయంగా తమ దృష్టికి తీసుకరావాలని తెలిపారు.ఆర్ఐ బసవన్న గౌడ్, డీలర్లు వన్నూరు, ప్రతాప్, మున్నా పాల్గొన్నారు.

చర్చి నిర్మాణానికి మద్రి ప్రవీణ్ రూ.లక్ష విరాళం

ప్రజాశక్తి - నందవరం

హాలహర్వి గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న టివిఎం చర్చి నిర్మాణానికి ఎమ్మిగనూరు పట్టణంలో నివసిస్తున్న హాలహర్వి గ్రామానికి చెందిన మద్రి దేవసహాయం కుమారుడు టీచర్ మద్రిప్రవీణ్ కుమార్ రూ.1లక్ష విరాళాన్ని అందించారు. ఆదివారం సంఘ కాపరి జాన్ మోజెష్, చర్చి సంఘ పెద్దలకు విరాళాన్ని అందజేశారు. ఆయన మాట్లాడుతూ చర్చి నిర్మాణానానికి సహాయం చేయడం అదృష్టంగా భావిస్తున్నానని అన్నారు. సంఘ కాపరి మాట్లాడుతూ మద్రిప్రవీణ్ లాంటి వ్యక్తులను ఆదర్శంగా తీసుకోవాలన్నారు. ఆయన మంచితనం, సహాయగుణం కలిగిన వ్యక్తి అని కొనియాడారు. చర్చి నిర్మాణానికి ప్రారంభంలో రూ.లక్ష , 180 సిమెంట్ బస్తాలు ఇచ్చారన్నారు. రెండోసారి రూ.లక్ష ఇవ్వటం హర్షించదగ్గ విషయమన్నారు. ఆయనను, ఆయన కుటుంబాన్ని ప్రభు కాపాడాలని ఆకాంక్షించారు. చర్చ నిర్మాణానికి దాతలు ముందుకు రావాలని కోరారు. మద్రి ప్రవీణను సంఘ పెద్దలు శాలువా కప్పి, పూలమాలవేసి సన్మానించారు. అనంతరం స్థానిక సంఘ కాపరి ప్రత్యేక ప్రార్థన చేశారు. సంఘపెద్దలు, సంఘస్తులు, యువకులు పాల్గొన్నారు.



శ్రీ మఠంలో అన్నదానానికి రూ.2.30 లక్షలు విరాళం

ప్రజాశక్తి-మంత్రాలయం : ప్రముఖ ఆధ్యాత్మిక పుణ్యక్షేత్రమైన మంత్రాలయంలోని శ్రీ రాఘవేంద్రస్వామి మఠంలో నిర్వహించు అన్నదానానికి రూ.2.30 లక్షల విరాళం అందించారు. ఆదివారం ఆదోనికి చెందిన శ్రీ రాఘవేంద్ర టెక్స్‌టైల్స్ యజమాని సుందర్ రాజు అనే భక్తుడు కుటుంబ సభ్యులతో కలిసి మంత్రాలయం వచ్చిన ఆయన గ్రామ దేవత మంచాలమ్మను రాఘవేంద్రస్వామి మూల బృందావనాన్ని దర్శించుకొని మంగళహారతులు స్వీకరించారు. ఈ సందర్భంగా పీఠాధిపతులు శ్రీ సుభుదేంద్రతీర్థులకు రూ.2.30 లక్షలు విరాళం అందించగా శ్రీ మఠం నుండి రసీదుతో పాటు శేష వస్త్రం ఫల మంత్రాక్షతలు అందజేసి ఆశీర్వదించినట్లు చెప్పారు.





కట్టెప్ప భౌతిక కాయం వద్ద నివాళ్లు అర్పిస్తున్న హనుమంతు తదితరులు

కట్టెప్ప మృతి పార్టీకి తీరని లోటు : సిపిఎం

ప్రజాశక్తి -హోలగుంద

హోలగుంద మండలం సిపిఎం సీనియర్ నాయకులు జమపూర్ కట్టెప్ప (70) మృతి పార్టీకి తీరనిలోటని సిపిఎం ఆలూరు ప్రాంతీయ కార్యదర్శి పి. హనుమంతు, మండల కార్యదర్శి వెంకటేశులు అన్నారు. ఆదివారం హోలగుంద లోని కట్టెప్ప భౌతికాయానికి పూలమాల వేసి నివాలర్పించి కుటుంబానికి సానుభూతి తెలిపారు. నాయకులు మాట్లాడుతూ హోలగుంద మండలంలో 1986లో సిపిఎం మాజీ ఎమ్మెల్యే ఎం.ఏ.గఫూర్ నాయకత్వంలో పార్టీని స్థాపించి పార్టీ సభ్యుడిగా, హమాలి సంఘం నాయకుడిగా ఉంటూ పార్టీ అభివృద్ధికి కషి చేస్తూ కడవరకు ఎర్రజెండాతో ఉన్నారన్నారు. ఈనెల 25న శనివారం అనారోగ్యంతో మతిచెందడం అందరిని కలచివేసిందని అన్నారు. కట్టెప్ప ఆశయాలను నెరవేర్చేందుకు కృషి చేస్తామని అయన కుటుంబానికి అండగా పార్టీ ఎల్లవేళలా పనిచేస్తుందని తెలిపారు. కట్టెప్పకు భార్య సోమమ్మా, ముగ్గురు కూతుళ్లు, ఒక కొడుకు ఉన్నారు.నాయకులు క్రిష్ణ, షాకీర్, మల్లయ్య, నాగరాజు పాల్గొన్నారు.

తాగునీటి పైపులైన్లు వేయాలి : సిపిఎం

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు



పట్టణంలోని రాఘవేంద్ర కాలనీలో కొత్తగా తాగునీటి పైపులైన్లు వేసి ప్రజలకు తాగునీరు అందించాలని సిపిఎం పట్టణ కార్యదర్శి గోవిందు పేర్కొన్నారు. రాఘవేంద్ర కాలనీలో సిపిఎం బృందం ఆదివారం పాదయాత్ర నిర్వహించింది. సిపిఎం పట్టణ కార్యదర్శి గోవిందు, నాయకులు అబ్దుల్లా, రమేష్, తిమ్మప్పలు మాట్లాడారు. 20ఏళ్ల నుండి రాఘవేంద్ర కాలనీలో ప్రధానంగా తాగునీటి తీవ్రంగా ఉందన్నారు. కొత్తగా పైపులైన్లు వేయాలని, కాలల్లో రోడ్ల నిర్మాణం చేపట్టాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ విషయంపై పలుమార్లు ఎమ్మెల్యేకు, అధికారులకు చెప్పినా.. పట్టించుకోవడం లేదని విమర్శించారు. మున్సిపల్ కమిషనర్ స్పందించి రాఘవేంద్ర కాలనీ, దామోదర్ సంజీవయ్య కాలనీలో వెంటనే కొత్త తాగినీటి పైపులైన్ ఏర్పాటు చేయాలని కోరారు. లేని ఎడల ఈ నెల 30న మున్సిపల్ కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు సుభాను, సురేష్, రఘునాథ్ రాఘవేంద్ర కాలనీవాసులు పాల్గొన్నారు.

ఉరుకుందలో వేగంగా అభివృద్ధి పనులు

డిప్యూటీ కమిషనర్ వాణి సమన్వయంతో పనులు ముందుకు

ప్రజాశక్తి-కౌతాళం



ప్రసిద్ధిగాంచిన పుణ్యక్షేత్రాలలో ఒకటైన శ్రీ లక్ష్మి నరసింహ ఉరుకుంద ఈరన్న స్వామి పుణ్యక్షేత్రంలో అభివృద్ధి పనులు పరుగులు పెడుతున్నాయి. స్వామివారి దర్శనం కోసం వచ్చే లక్షలాదిమంది భక్తులకు మౌలిక సదుపాయాలు కల్పించాలని ఉద్దేశంతో దేవాలయ డిప్యూటీ కమిషనర్ వాణి పుణ్యక్షేత్రం పరిసరాలలో పరిశీలించి భక్తులకు అవసరమైన సౌకర్యాలను గుర్తించి ఎన్నో అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. ఇందులో 28 పనులకు టెండర్లు పూర్తి కావడం తో ఆ అభివృద్ధి పనులను ప్రారంభించి వేగవంతంగా జరిగేలా చర్యలు తీసుకుంటున్నారు. మరో ఆరుపనులు ఇంజనీరింగ్ అధికారులు ప్రణాళికలను సిద్ధం చేసి, ఆ పనులు కూడా దేవదాయ శాఖ వారు టెండర్లను ఆహ్వానించడానికి కృషి చేస్తున్నారు. ఈ అభివృద్ధి పనులన్నీ పుణ్యక్షేత్రంలో పరుగులు తీస్తున్నాయి..! శ్రీ లక్ష్మీ నరసింహ ఉరుకుంద ఈరన్న స్వామి పుణ్యక్షేత్రంలో మంజూరైన పనులు వివరాలు ఇలా ఉన్నాయి. నిత్య అన్నదాన సత్రంసిసి పవర్స్, తుంగభద్ర దిగువ కాలువలో భక్తులు స్థానాలు ఆచరించడానికి కుడి వైపు రెండు చోట్ల, ఎడమ వైపు రెండు చోట్ల మెట్లు నిర్మాణం పనులు జరుగుతాయి. ఇదే ప్రాంతంలో సిసి ఫ్లోరింగ్ తోపాటు మెట్లకు గోడ నిర్మిస్తున్నారు. కాలక్షేప మండపం, స్త్రీ, పురుషుల డార్మెటరీహాల్ సమీపంలో టాయిలెట్ బాత్రూం వేరువేరుగా నిర్మాణ పనులు జరుగుతున్నాయి. గోశాల పునర్నిర్మానంతో పాటు ఐరన్‌గ్రిల్ , ఫ్లోరింగ్ పనులు చేపడుతున్నారు. ఓపెన్ సైట్లో స్త్రీ పురుషులకు ప్రత్యేక డార్మెటరీ హాల్ నిర్మాణం, తుంగభద్ర కాలువ వద్ద మహిళలకు డార్మెటరీహాల్, కోసిగి ఆదోని రోడ్డు వైపు టాయిలెట్ బాత్రూం నిర్మాణ పనులు, ఆదోనిఆర్చి గేటు సమీపంలో రిసెప్షన్ కార్యాలయం, తూర్పు పడమర ఉత్తర దక్షిణ గోపురాల ముందు మిగిలి ఉన్న పనులు పూర్తి చేస్తున్నారు. 30 రూముల వద్ద డ్రెయిన్ నిర్మాణ పనులు, టికెట్ కౌంటర్ వెనుక భాగంలో క్యూలైన్, అన్నదానం రోడ్డు, దేవాలయం కార్యాలయం రోడ్డు సిసి పవర్స్ పనులు చేయడానికి శ్రీకరం చుట్టారు. ముఖ్యంగా దేవస్థానం కార్యాలయం వద్ద, 30 రూముల వద్ద, 25,42 రూముల వద్ద, 107,210 రూముల సమీపంలో భారీ ఎత్తున ఐమాక్స్ విద్యుత్ లైట్స్ ఏర్పాటు చేస్తున్నారు.

ప్రతిపాదనలు: పైన పేర్కొన్న అభివృద్ధి పనులతో పాటు మరికొన్ని పనులు ప్రతిపాదనలో ఉన్నాయి. అన్నదానం జిప్లస్ వన్, పరిపాలన భవనం, 50 వసతి గృహాలు, మాడవీధులు, లడ్డు పోటు నిర్మాణ పనులు కోసం ప్రతిపాదనలు పంపామని డిప్యూటీ కమిషనర్ వాణి తెలిపారు. ఆమె మాట్లాడుతూ దేవాలయానికి భక్తులకు సేవలు అందించడమే తమ లక్ష్యమని అన్నారు. 2019 నుండి 2023 వరకు కోట్ల రూపాయలతో ఎన్నో అభివృద్ధి పనులు చేశారన్నారు. ఇందులో కొన్ని ముఖ్యమైనవి మహాప్రకారం నిర్మాణం, రాజ గోపురాలు, క్యూలైన్లు, గ్రెనేట్ బండ పరుపు, గెస్ట్‌హౌస్, పార్కు, షెడ్లు తదితర పనులు గతంలోనే అందరి సహకారంతో చేపట్టామన్నారు.కొత్తగా మంజూరైన పనులను వేగవంతంగా జరిగేలా కృషి చేస్తామన్నారు.




రాఘవేంద్రుని సన్నిధిలో భక్తుల కోలాహలం

ప్రజాశక్తి-మంత్రాలయం

ప్రముఖ ఆధ్యాత్మిక పుణ్యక్షేత్రమైన మంత్రాలయంలో కొలువైన రాఘవేంద్రస్వామిని దర్శించుకునేందుకు వచ్చిన భక్తులతో శ్రీ మఠంలో కోలాహలం నెలకొంది. ఆదివారం రాఘవేంద్రస్వామి దర్శనార్థమై దేశంలో ఉన్న వివిధ ప్రాంతాల నుండి వచ్చిన భక్తులు గ్రామ దేవత మంచాలమ్మను రాఘవేంద్రస్వామి మూల బృందావనాన్ని దర్శించుకొనేందుకు బారులు తీరారు. స్వామి వారికి ప్రత్యేక సేవలు చేయించిన భక్తులకు ప్రత్యేక దర్శన భాగ్యంతో పాటు పూజలో పాల్గొన్నారు. ప్రత్యేక సేవలు చేయించిన భక్తుల సమక్షంలో శ్రీ మఠం దివాన్ రాఘవేంద్రుని బృందావన ప్రతిమకు విశేష పూజలు నిర్వహించి మంగళ హారతులు ఇచ్చి ఫల మంత్రాక్షతలు అందజేసి ఆశీర్వదించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని క్యూలైన్ ద్వారా దర్శన అవకాశం కల్పించారు. శ్రీఘ్ర దర్శనానికి ప్రత్యేక క్యూలైన్ ద్వారా అవకాశం కల్పించారు.

శ్రీ మఠంలో ఘనంగా స్వర్ణ పల్లకోత్సవం

ప్రముఖ ఆధ్యాత్మిక పుణ్యక్షేత్రమైన మంత్రాలయంలోని శ్రీ రాఘవేంద్రస్వామి మఠంలో రాఘవేంద్రుని స్వర్ణ పల్లకోత్సవం ఘనంగా నిర్వహించారు. ఆదివారం స్వర్ణ పల్లకి సేవ చేయించిన భక్తుల సమక్షంలో రాఘవేంద్రుని బృందావన ప్రతిమకు విశేష పూజలు నిర్వహించి మంగళ హారతులు ఇచ్చిన అనంతరం బృందావన ప్రతిమను స్వర్ణ పల్లకిలో ఉంచి పల్లకీ సేవ చేయించిన సేవాదారులతో స్వర్ణ పల్లకిని మోయించి మేళ తాళాలు మంగళ వాయిద్యాల నడుమ శ్రీ మఠం ప్రాకారంలో ఘనంగా పల్లకోత్సవం నిర్వహించారు. శ్రీ మఠం సహాయక పిఆర్ఒ హోన్నాళ్ళి వ్యాసరాజాచార్ ,పూజారులు భక్తులు పాల్గొన్నారు.





సంఘం అభివృద్ధికి కృషి

ప్రజాశక్తి-ఆదోనిరూరల్

రాష్ట్ర జంగమ మహేశ్వర సంక్షేమ సంఘం అభివృద్ధికి కషి చేస్తామనిమహర్షి విజయ్ కుమార్ స్వామి తెలిపారు. ఆదివారం కర్నూలులో రాష్ట్ర జంగమ మహేశ్వర సంక్షేమ సంఘం కార్యవర్గ ప్రమాణస్వీకారం నిర్వహించారు.జెపి మల్లికార్జున స్వామి కర్నూలు అధ్యక్షులుగా, ఎం.రుద్రయ్య కార్యదర్శిగా, మహర్షి విజయ్ కుమార్ స్వామి ప్రమాణ స్వీకారం చేశారు. సంఘం సభ్యులు మాట్లాడుతూ జంగమ సామాజిక వర్గం రాజకీయ సామాజిక వర్గాలలో ఎంతో వెనుకబడి ఉన్నదని వారిలో చైతన్యం తీసుకురావడం పరిరక్షణ సంఘానికి గుర్తింపు తీసుకురావడం మా ప్రథమ కర్తవ్యమన్నారు. ప్రతిసారి శ్రీశైలం ట్రస్ట్ బోర్డు సభ్యత్వం కోసం మనకు హక్కు ఉండి కూడా సాధించుకోలేకపోతున్నామన్నారు. ఆ సమస్యను అధిగమించడం కోసం ప్రభుత్వాన్ని ఆర్డినెన్స్ ఇచ్చే విధంగా సంఘం ద్వారా కృషి చేయాలని సంకల్పించినట్లు తెలిపారు. బిసి ఎ సీరియల్ నెంబర్ 9 జంగం కుల సర్టిఫికెట్ల దుర్వినియోగాన్ని అరికట్టాలని ఏకగ్రీవ తీర్మానం చేశారు.

నూతన కార్యవర్గం ఎన్నిక : గౌరవాధ్యక్షులుగా చేన్నబశయ్య స్వామి, కెవి.నాగేశ్వరయ్య, చంద్రయ్య,ఉపాధ్యక్షులుగా నటరాజ్ స్వామి, బండయ్య స్వామి, మఠమల్లికార్జునస్వామి, జెపినాగేశ్వరయ్య, కార్యనిర్వాహక కార్యదర్శిగా మఠం శివకుమార్ నంద్యాల, సహాయ కార్యదర్శిగా మఠం మల్లికార్జున స్వామి మంజునాథ స్వామి, కార్య వర్గ సభ్యులుగా అశోక్ కుమార్, వినయ్ కుమార్, మహేష్ తది తరులు ప్రమాణస్వీకారం చేశారు.



అధికారికి అభినందనలు తెలుపుతున్న యూనియన్ నాయకులు

వ్యవసాయ శాఖ అధికారికి అభినందనలు

ప్రజాశక్తి కర్నూలు కలెక్టరేట్

ఇటీవల పదోన్నతి పొందిన జిల్లా వ్యవసాయ అధికారి పిఎల్ వరలక్ష్మి వ్యవసాయ శాఖ ఉద్యోగుల సర్వీస్ సంఘం అసోసియేషన్ నేతలు కలిసి ఆదివారం అభినందనలు తెలిపారు. రాష్ట్ర అధ్యక్షులు పివి.సాయికుమార్, జిల్లా వ్యవసాయ శాఖ ఉద్యోగుల సర్వీస్ సంఘం జిల్లా అధ్యక్షులు రవి ప్రకాష్, జిల్లా కార్యదర్శి ఎంసి కాశన్న, రాష్ట్ర ఉపాధ్యక్షులు మహేంద్ర, జిల్లా అసోసియేట్ అధ్యక్షులు పి.రమేష్, రాష్ట్ర టైపిస్టు , స్టెనోగ్రాఫర్ల అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శంకర్‌నాయక్, జిల్లా కోశాధికారి నాగకిషోర్ తదితరులు కలిశారు. జిల్లా వ్యవసాయ శాఖలో పనిచేసే ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని వారు విన్నవించారు. జిల్లా ఉపాధ్యక్షులు యాసనుల, సంయుక్త కార్యదర్శి ఇలియాస్‌బాషా, దేవరాజు, ఇతర వ్యవసాయ శాఖ ఉద్యోగులు సుధాకర్ రెడ్డి, శ్రీనివాస్ నాయుడు, ధర్మారెడ్డి పాల్గొన్నారు.



ఎస్ఎల్‌సిని ప్రారంభిస్తున్న క్లస్టర్ ప్రిన్సిపల్ అన్వర్‌బాషా

పిల్లల్లో ఆత్మవిశ్వాసం పెరగాలి

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

విద్యార్థి దశలో చిన్నారుల ఆత్మవిశ్వాసం పెంచడంలో తల్లిదండ్రులు కీలక పాత్ర పోషించాలని స్కూల్ క్లస్టర్ ప్రిన్సిపల్ అన్వర్‌బాషా తెలిపారు. ఆదివారం కర్నూలు నగరంలోని మాధవ్ నగర్ లోని నారాయణ పాఠశాలలో ప్రిన్సిపల్ మహమ్మద్ అల్తాఫ్ ఆధ్వర్యంలో ఈ చాంప్స్ విభాగంలో స్టూడెంట్ లెడ్ కాన్ఫరెన్స్ (ఎస్ఎల్‌సి) ప్రారంభించారు. ముఖ్య అతిథిగా హాజరైన క్లస్టర్ ప్రిన్సిపల్ తల్లిదండ్రులను ఉద్దేశించి మాట్లాడారు. విద్యార్థులు తమ అభ్యాస బాధ్యతను తీసుకోవడానికి ప్రోత్సహించినప్పుడే తమ పిల్లల పురోగతి తెలుస్తుందన్నారు. ఇలాంటి ప్రదర్శన కారణంగా తమ పిల్లల నైపుణ్యాలు మరింతగా అభివృద్ధి చెంది ఉన్నత శిఖరాలకు చేరుకుంటారని సూచించారు. కార్యక్రమంలో ఈ చాంప్స్ కోఆర్డినేటర్ షాహిదా, వైస్ ప్రిన్సిపల్ నాగేశ్వరి పాల్గొన్నారు.



కుట్టుమిషన్లు పంపిణీ చేస్తున్న వైకుంఠం జ్యోతి, ట్రస్ట్ సభ్యులు

మహిళలకు కుట్టుమిషన్లు పంపిణీ


టిడిపి ఇన్‌చార్జ్ వైకుంఠం జ్యోతి

ప్రజాశక్తి-ఆలూరు

మహిళలు ఆర్థికంగా నిలదొక్కుకునేందుకు అక్షిత చారిటబుల్ ట్రస్ట్ వారి సహకారం హర్షించదగ్గ విషయమని ఆలూరు టిడిపి ఇన్‌చార్జ్ వైకుంఠం జ్యోతి తెలిపారు. ఆదివారం వైకుంఠం జ్యోతి స్వగృహంలో అక్షిత చారిటబుల్ ట్రస్ట్ సహకారంతో 100మంది మహిళలకు ఒక్కొక్కరికి 14వేలు విలువ చేసే కుట్టుమిషన్లు 50శాతం సబ్సిడీతో రూ 6,700కు అందజేశారు.ఈ సందర్భంగా ఆమే మాట్లాడుతూ ఆలూరు ప్రాంతంలో ఉపాధి లేక మహిళలు ఇతర ప్రాంతాలకు వలస వెళ్లకుండా మంచి ఆలోచనతో అక్షిత ట్రస్ట్ వారు 50శాతం సబ్సిడీతో కుట్టుమిషన్లు అందించడం హర్షించదగ్గ విషయమన్నారు. ఆలూరు మహిళల, వైకుంఠం జ్యోతి సంతోషంతో అక్షిత ట్రస్ట్ వారికి కృతజ్ఞతలు తెలిపారు.

పత్తికి గిట్టుబాటు ధర కల్పించాలి : ఎపి రైతుసంఘం

ప్రజాశక్తి-ఎమ్మిగనూరు రూరల్



చైర్మన్‌కు వినతిపత్రం ఇస్తున్న వెంకటేశులు, తదితరులు

ఎమ్మిగనూరు వ్యవసాయ మార్కెట్ యార్డులో రైతులు అధిక అధిక వర్షపాతంతో పండించిన అన్ని రకాల పత్తి పంటను ప్రభుత్వం తెలిపిన కనీస మద్దతు ధర రూ.8110 కు తేమశాతంతో సంబంధం లేకుండా వెంటనే సిసిఐ కొనుగోలు చేసి రైతులను ఆదుకోవాలని వ్యవసాయ మార్కెట్ యార్డ్ చైర్మన్ కురువ మల్లయ్యకు ఎపి రైతు సంఘం జిల్లా అధ్యక్షులు వెంకటేశులు, ఉపాధ్యక్షులు సి .హనుమంతు అందజేశారు. వారు మాట్లాడుతూ కర్షుడి చావుకి అనేక కారణాలు! రైతుల పరిస్థితికి అవే కారణాలు అన్నట్లుగా ప్రభుత్వాలు వ్యవహరిస్తున్నాయన్నారు. గత సంవత్సరం మన జిల్లాలో రూ.కోటి 20 లక్షల పత్తి పంట దిగుబడి వస్తే అందులో 40 లక్షల క్వింటాళ్ల మాత్రమే కొనుగోలు చేసి మిగిలిన పత్తిని వ్యాపారస్తులకు, పరిశ్రమలకు రైతులు తక్కువ ధరకు అమ్ముకున్నారన్నారు. ఈ సంవత్సరం క్రాప్ బుకింగ్ చేసుకుని, 8 నుండి 12 శాతం తేమ ఉన్న పత్తిని కొనుగోలు చేస్తామని సిసిఐ ప్రకటించిందన్నారు. సిసిఐ తేమశాతంతో సంబంధం లేకుండా రైతుల నుండి పత్తిని కొనుగోలు చేస్తూ రైతుల అకౌంట్లోకి వెంటనే డబ్బులు జమ చేయాలన్నారు. డాక్టర్ స్వామినాథన్ కమిషన్ సిఫార్సుల ప్రకారం పత్తి పంటకు కనీస మద్దతు ధర రూ.పదివేలు ఇవ్వాలన్నారు. రైతు పండించే అన్ని పంటలకు ఉచిత బీమా పథకం అమలు చేసే విధంగా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని మార్కెట్ చైర్మన్ ను కోరారు. రైతు సంఘం మండల నాయకులు అబ్దుల్, రాముడు, మాదన్న పాల్గొన్నారు. ఛైర్మన్ మాట్లాడుతూ సిసిఐ పత్తిని కొనుగోలు చేసే విషయంలో రైతులకు ఎటువంటి అవకతవకలు జరగకుండా చర్యలు తీసుకుంటామని వ్యవసాయ మార్కెట్ యార్డ్ చైర్మన్ కురువ మల్లయ్య తెలిపారు.

వేధింపుల నుండి రక్షించండి

- కెజిబివి స్కావెంజర్ లక్ష్మి



ప్రజాశక్తి - కౌతాళం : కౌతాళంలోని కెజిబివి పాఠశాల హాస్టల్ సిబ్బంది వేధింపుల నుండి కాపాడాలని స్కావెంజర్‌గా విధులు నిర్వహిస్తున్న దళిత మహిళ లక్ష్మి కోరారు. ఆదివారం ఆమె మాట్లాడుతూ ఈ పాఠశాలలో పని చేస్తున్న ఎస్ఓ పుష్పలత, పిఇటి లక్ష్మి, వంటవాళ్ళు అన్నమ్మ, అంజినమ్మ, నరసమ్మలు నన్ను వేధింపులకు గురిచేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పిఇటి లక్ష్మి వాళ్ళ వదినకు స్కావెంజర్ పోస్టు రాకపోవడంతో నన్ను వేధింపులకు గురిచేసి ఇక్కడ నుండి తొలగించే కుట్ర చేస్తున్నారని ఆరోపించారు. ఎంత బాగా పని చేసినా మా పని తనం పట్ల చివాట్లు పెడుతున్నారని, ఎస్సినని చిన్న చూపు చూస్తున్నారని ఆవేదన వ్యక్తం చేసింది. అందరూ కలిసి నాపై దుర్భాషలాడుతున్నారని వాపోయారు. ఏడాది నుండి వేధింపులకు గురి చేస్తున్నా భరిస్తూ వచ్చాని, ఇక భరించలేక మీడియా ముందుకు వచ్చానన్నారు. ఈ విషయం పట్ల మండల విద్యాధికారి శోభారాణి దృష్టికి తీసుకెళ్లానని తెలిపారు. ఆమె హాస్టల్‌కు వచ్చి సిబ్బంది అందరికీ కౌన్సిలింగ్ ఇచ్చారన్నారు. ఎంఇఒ వచ్చిన మరుసటి రోజు నుండి మరింత ఎక్కువగా వేధింపులకు గురి చేయడం ప్రారంభించారన్నారు. ఇప్పటికైనా వేధింపుల నుండి నన్ను రక్షించి న్యాయం చేయాలని కోరారు. ఎస్ఓ పుష్పలతను వివరణ కోరగా లక్ష్మి చేసిన ఆరోపణల్లో వాస్తవం లేదన్నారు. ఆమె సక్రమంగా విధులు నిర్వహించక, ఇలాంటి ఆరోపణలు చేస్తున్నారన్నారు.

విద్యార్థులను క్రీడాకారులుగా తీర్చిదిద్దాలి

ప్రజాశక్తి-ఆదోని : విద్యార్థులను క్రీడాకారులుగా తీర్చిదిద్ది ప్రయోజకులను చేయాలని ప్రభుత్వ పాఠశాలల్లో క్రీడల అభివృద్ధికి కొత్తగా బాధ్యతలు చేపట్టిన వ్యాయామ ఉపాధ్యాయులు కృషి చేయాలని ఆదోని పెద్దకడుబూరు మండల విద్యాశాఖ అధికారులు శ్రీనివాసులు, రామ్మూర్తి తెలిపారు. ఆదివారం మున్సిపల్ ఉన్నత పాఠశాలలో ఇటీవల డిఎస్‌సిలో ఎంపికై వ్యాయామ ఉపాధ్యాయులుగా బాధ్యతలు చేపట్టిన వారిని 60 మందిని, జిల్లా ఉత్తమ వ్యాయామ ఉపాధ్యాయుడిగా అవార్డు అందుకున్న గిరిజన రామన్నను ఎపిపిఇటిఎస్, ఎస్ఎపిఇ అసోసియేషన్ ఆదోని జోన్ సభ్యులు ఘనంగా సన్మానించారు. ముఖ్య అతిథులుగా హాజరైన మండల విద్యాశాఖ అధికారులు మాట్లాడుతూ వెనుకబడిన పశ్చిమ ప్రాంత గ్రామాల ప్రభుత్వ పాఠశాలల్లో ఎంతోమంది నైపుణ్యత కలిగిన క్రీడాకారులు ఉన్నారని వారిని గుర్తించి క్రీడల్లో ప్రోత్సహిస్తే మంచి క్రీడాకారులుగా ఎదుగుతారన్నారు. క్రీడల అభివృద్ధికి ప్రభుత్వం ప్రోత్సహిస్తుందని, ఇందుకు కొత్తగా ఎంపికైన వ్యాయామ ఉపాధ్యాయులే నిదర్శనం అన్నారు. అనంతరం వారిని పూలమాల శాలువాతో ఘనంగా సన్మానించారు కార్యక్రమంలో అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు జోసెఫ్ లక్ష్మయ్య, జిల్లా ప్రధాన కార్యదర్శి చందు నాయక్ కోశాధికారి శ్రీనివాసులు, ఆదోని జోన్ అధ్యక్ష కార్యదర్శులు నరసింహారాజు, నరసింహులు, రిటైర్డ్ ఫిజికల్ డైరెక్టర్ నరసయ్య, ఈరన్న వున్నారు.

మద్యం వ్యాపారంతో ప్రాణాలు తీశారు

-టిడిపి నియోజకవర్గ ఇంచార్జ్ ఎన్ రాఘవేంద్ర రెడ్డి

ప్రజాశక్తి-మంత్రాలయం



నకిలీ మద్యం వ్యాపారంతో గత వైసిపి ప్రభుత్వం మద్యం ప్రియుల ప్రాణాలు తీసిందని టిడిపి నియోజకవర్గ ఇంచార్జ్ ఎన్ రాఘవేంద్ర రెడ్డి ఆరోపించారు. ఆదివారం మండల పరిధిలోని మద్యం దుకాణంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆవిష్కరించిన సురక్ష యాప్ ద్వారా మద్యం పరీక్షలు చేశారు. ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ప్రవేశపెట్టిన సురక్ష యాప్‌తో మద్యం నాణ్యతతో ఉందా, కల్తీతో ఉందా తెలుస్తుందని చెప్పారు. వైసిపి ప్రభుత్వంలో జె-బ్రాండ్స్‌తో వేలమంది ప్రాణాలు పోతే కనీసం పట్టించుకోని వైసిపి నేతలు కూటమి ప్రభుత్వంలో ప్రవేశ పెట్టిన మద్యం మీద దుష్ప్రచారం ప్రచారం చేస్తున్నారని విమర్శించారు. ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి తమ ప్రభుత్వంలో కర్ణాటక బుడ్డీలను(మందు) ప్రతి గ్రామంలో ఏరులై పారించి ప్రజల ప్రాణాలతో చెలగాటలాడారని ఆరోపించారు. ఆదాయం కంటే మద్యం ప్రియుల ఆరోగ్యమే ముఖ్యంగా భావించిందని అందుకే మా ప్రభుత్వం నాణ్యమైన మద్యం సరఫరా చేస్తుందని అన్నారు. కల్తీ మద్యానికి చెక్ పెట్టేందుకు మొబైల్ యాప్‌ను కూడా అందుబాటులో ఉంచామన్నారు. అక్రమ మద్యం బయటపెట్టడానికి నలుగురు ఐఎఎస్‌లను కూటమి ప్రభుత్వం కేటాయించిందని తెలిపారు. మండల అధ్యక్షులు గోపాల్‌రెడ్డి, మాజీ జడ్‌పిటిసి ఆర్.లక్ష్మయ్య, జిల్లా అధికార ప్రతినిధి చావిడి వెంకటేష్, విజయ్, చంద్ర, హనుమంతు, లక్ష్మయ్య, శివ, ఉసేని ఇతర టిడిపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.



జర్నలిస్టు విద్యాసాగర్‌కు మాతృవియోగం

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్

యునైటెడ్ జర్నలిస్ట్ ఫోరం (యుజెఎఫ్) జిల్లా అధ్యక్షులు దండు విద్యాసాగర్‌కు ఆదివారం ఉదయం మాతృవియోగం కలిగింది. ఈ మేరకు యునైటెడ్ జర్నలిస్ట్ ఫోరం జిల్లా, నగర నాయకులు పి. యూసుఫ్ ఖాన్,నీలం సత్యనారాయణ, పరమేష్,విజయ్ కుమార్,ఆసిఫ్, దామోదరం సంజీవయ్య, కిషోర్, మల్లి, వరుణ్ యాదవ్, కెమెరామెన్ అంజి, ఇతర జర్నలిస్టులు మాతృమూర్తి దండు సావిత్రి (65) భౌతిక కాయానికి పూలమాల వేసి తమ ప్రగాఢ సంతాపం తెలిపారు. దండు సావిత్రికి ముగ్గురు కుమారులు, ఇద్దరు కుమార్తెలు సంతానం ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దండు సావిత్రి అకాలమరణం తమను తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసిందని పేర్కొన్నారు.

చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు దూరంగా ఉండండి

ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్: కర్నూలు జిల్లా ఎస్‌పి విక్రాంత్ పాటిల్ ఆదేశాల మేరకు జిల్లాలో నేరనియంత్రణ , శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా పోలీసు అధికారులు అన్ని పోలీసు స్టేషన్ల పరిధిలలో రౌడీ షీటర్లకు , నేరచరిత్ర గలవారికి , చెడు నడత కలిగిన వ్యక్తులకు కౌన్సిలింగ్ నిర్వహించారు. సత్ప్రవర్తనతో జీవించాలని, నేర ప్రవృత్తికి స్వస్తి పలకాలని, చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు దూరంగా ఉండాలని సూచించారు. చట్ట వ్యతిరేక కార్యకలాపాలలో పాల్గొంటే తప్పనిసరిగా చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసు అధికారులు హెచ్చరించారు.

విద్యాధికారులకు సన్మానం

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్ : కర్నూలు జిల్లా లో 2025 సంవత్సరంలో ప్రధానోపాధ్యాయులుగా మండల విద్యాశాఖాధికారులుగా విధులు నిర్వహించి పదవీ విరమణ చేసిన వారందరికీ ఆంధ్రప్రదేశ్ ప్రధానోపాధ్యాయ సంఘం తరపున ఆదివారం కర్నూలు ప్రభుత్వ టౌన్ మోడల్ స్కూలులో ఘన సన్మానం నిర్వహించారు. ఈ కార్యక్రమం లో జిల్లా విద్యా శాఖాధికారి ఎస్. శామ్యూల్ పాల్, ఆంధ్రప్రదేశ్ ప్రధానోపాధ్యాయసంఘం అధ్యక్షులు వై. నారాయణ, ప్రధాన కార్యదర్శి డి.సి.హుస్సేన్, కార్యవర్గ సభ్యులు ఎం. రమేష్, రమేష్ నాయుడు, శ్రీనివాస యాదవ్, ఎస్.విజయమ్మ, కర్నూలు జిల్లా ఉర్దూ డిఐ అదాం బాషా, విశ్రాంత ప్రధానోపాధ్యాయులు, విశ్రాంత మండల విద్యా శాఖాధికారులు, ప్రస్తుత హెచ్ఎంలు, ఎంఇఒలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. జిల్లా విద్యా శాఖాధికారి శామ్యూల్‌పాల్ మాట్లాడుతూ జిల్లాలో హెచ్ఎంల సేవలు అమూల్యమైనవని, హెచ్ఎంల సేవలను కొనియాడారు. ఇటువంటి కార్యక్రమం చేపట్టిన ఆంధ్రప్రదేశ్ ప్రధానోపాధ్యాయ సంఘం సేవలను అభినందించారు.

29న కర్నూలు తాలూకా పోలీస్ స్టేషన్లో వాహనాలకు వేలం

ప్రజాశక్తి కర్నూలు క్రైమ్

గతంలో ఎక్సైజ్ కేసులలో పట్టుబడిన 36 వాహనాలను జిల్లా ఎస్‌పి, డిప్యూటీ ఎక్సైజ్ కమిషనర్ ఉత్తర్వుల మేరకు ఈ నెల 29న కర్నూలు తాలూకా పోలీస్ స్టేషన్లో ఉదయం 10:00 గంటలకు వాహనాల వేలం వేయనున్నట్లు తాలూకా సిఐ తేజ మూర్తి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. వేలంలో పాల్గొనే అభ్యర్థులు రూ.5000 లు ధరావత్తు చెల్లించి రిజిస్ట్రేషన్ చేపించుకొని వాహనాల వేలంలో పాల్గొనాలని పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు స్టేషన్లో గాని, 9121101063, 9121101064

సర్పంచి చొరవతో పాతబావి పూడిక తీత

ప్రజాశక్తి-సి బెళగల్

సి బెళగల్ లో పాడు బడ్డ పాత బావి పూడిక తీతకు సర్పంచి పాండు రంగన్న చొరవచూపారు. 30 అడుగుల లోతు ఉన్న ఈ బావి గత పదేళ్ల క్రితం వరకు మంచి నీరును అందించింది. అయితే బోరు బావుల నీటికి, ఫిల్టర్ నీటికి అలవాటు పడ్డ ప్రజలు ఈ బావి నీటి కోసం వెళ్లడం ఆపేశారు. ప్రస్తుతం గ్రామంలో మూగ జీవాలకు, ఇంటి అవసరాల కొరత తీర్చేందుకు ఈ బావి నీళ్లు అవసరం ఉందని పలువురు భావించారు. సర్పంచి వెంటనే చొరవ చూపి పూడిక, చెత్త వంటివి ఎత్తివేయించారు. గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.